


గుంటూర్లో బస్సు ఆగగానే బిల బిల మంటూ దిగటం ప్రారంభించారు ప్రయాణీకులు.

తన లగేజ్ వేపు దిగులుగా చూసుకుంటూ సీటులో నుంచి లేచి నిలబడింది శిల్ప. రెండు చేతులంతోటీ రెండు బుట్టలూ పట్టుకునేసరికి ఇదే సందని జారటం మొదలెట్టింది పైట

కుడిచేతిలో బుట్ట కిందపెట్టి, పైట గట్టిగా లాగి చేతికింద నుంచి బొడ్లో దోపింది.

"త్వరగా దిగమ్మా" అసహనంగా అంటు న్నారు వెనక నిలబడ్డ పాసింజర్లు

"మీరు దిగండి మేడం. లగేజ్ నే నంది స్తాను" అన్నాడొకతను.

ఒక్కొక్క వస్తువూ అందుకుని పక్కన పేర్చింది. మొత్తం ఎనిమిదిశాల్తీలు. చుట్టూరా చూసింది శిల్ప. ఎక్కడా భర్త జాడ లేదు. టెలిగ్రాంఇచ్చినా అతను రానందుకు ఉక్రోషంతో ఎర్రబడిందామె ముఖం.

ఇంతలో ఇద్దరు మనుషులొచ్చి గబగబా రెండు చేతులలోకీ ఆమె సామాను తీసుకుని, ఆమె ప్రమేయం లేకుండానే ముందుకు రెండ డుగులేసి "రండమ్మా! రెండు రిక్షాలు కావాలిగా" అంటూ "అరె పొండెహె. ముందుగా మేమడిగాం" అని పక్కవాళ్ల నదిలిస్తున్నారు

"నాకసలు రిక్షా వద్దు ముందు సామానక్కడ పడెయ్యండి" అని అరిచి, చుట్టూచూసి ఉలిక్కిపడింది శిల్ప

యాక్సిడెంటయితే గుమిగూడినట్లు రిక్షా వాళ్లూ, ఆటోవాళ్ల గుంద్రంగా ఆమె చుట్టూ నిలబడ్డారు ఒకళ్ల భుజంమీద ఇంకోళ్ల చేతు లేసుకొని...అంత లగేజ్‌తో ఒంటరిగా నిలబడ్డ శిల్పను వినోదంగా చూస్తూ వాళ్లలో వాళ్లు వాదించుకుంటున్నారు కొందరు.

"ఎక్కడికెళ్లాలి? ఏ పేట? నా రిక్షాలో రండి.. ఒక్క రిక్షా చాలదమ్మా నా ఆటోలో రండి" అంటూ ఆమెను ఊపిరి తీసుకోని వ్వటల్లేదు వాళ్లు.

భయంగా దిగులుగా ఉందామెకు

"రెండు రిక్షాలట్టుకొచ్చేస్తాం బేగి చెప్పమ్మా, ఏ పేట? గమ్మునెళ్లిపోదాం." ఇంకో ఇద్దరు రిక్షావాళ్లు మళ్లీ ఆమె సామాను అందుకోబోయారు

"రెండు రిక్షా లెందుకెహె! నా ఆటోలో రండమ్మా సామానంతా నే సర్దుతాను" ఆటో వాడు తోసుకొచ్చాడు.

"లక్ష్మీపురమెళ్ళాలి ఏం తీసుకుంటావ్?" అన్నది శిల్ప.

"ఆర్రూపాయలివ్వండి."

"ఆరా!"

"ఆరంటమేగానీ.. ఏమొస్తున్నాయమ్మా వాటికి? రెండు రిక్షాలకీ వాళ్ళు ఎనిమిది రూపాయలు తీసుకుంటారు నేను ఆరుకే వస్తానంటునాను గదా! పోనీ అయిదున్నర చేసుకోండి!"

వాళ్ళిద్దరికీ బేరం కుదిరిపోతోందని గ్రహించి "ఆయమ్మ రెండు రిక్షాలు కావా లంటే నువ్వు ఒక్క ఆటో చాలంటూ వెళ్ళి మా నోళ్ళు కొడతావా! ఇంత లగేజెట్టా సదుర్తావ్?" అని విరుచుకుపడుతూ— "ఎల్లండెల్లండమ్మా. ఈ ఆటోవాళ్ళ సంగ తెవురికి తెలీదు? సామానెట్ట పట్టుద్దో మేం చూడం?" అంటూ శిల్పను ఎద్దేవా చేశారు రిక్షావాళ్ళు.

నవ్వులు. కేకలు తిట్లు

ముందీ వాతావరణం నుంచి బయట పడకపోతే పిచ్చెక్కేలా ఉందామెకు

"ఇక్కడో ఇద్దరు పోలీసుల్ని పెట్ట కూడదూ? వీళ్ళంతా ఇలా దౌర్జన్యంగా



# భయం....భయం!

## – ఆదూరి సావిత్రి

ప్యాసింజర్ల మీదికెగబడి వ్రేలెత్తించకుండా" అని విసుక్కుంటూ సూట్‌కేస్ చేతోపట్టుకుని బేరమాడ్డం సంగతికూడా మర్చిపోయి ఆటోవాడి వెనకాల నడిచిందామె.

వెనక సీట్లో ఆమె పక్కన రెండు బుట్టలు, మిగతావి కాళ్ళ దగ్గరపెట్టి, ఆఖరుగా మిగిలిన రబ్బర్ బకెట్‌ను ముందు సీట్లో పెట్టాడు ఆటో డ్రైవరు. బయల్దేరబోతూ పక్కకు తిరిగి ఎవడి వంకో చూసి ఈల వేసి నవ్వాడు.

"కొట్టు గురో !" అంటూ అవతలివాడు కూడా నవ్వాడు.

రయ్యిన ముందుకు దూకింది ఆటో .

"ఏమిటి వాళ్ళ భాష ? కొంపతీసి ఆటోను దారి మళ్ళించి ఊరుబైటికి లాక్కుపోడు గదా !"

గుండాగినంత పనయింది శిల్పకు. అప్రయత్నంగా చెయ్యి మెడమీదకు, చూపు చేతులమీదకూ తిరిగాయి

ఈ గొలుసూ, గాజులూ వాడు చూసే ఉంటాడు. వాడికి వీడేమన్నా సంకేతం పంపాడా? ఎన్ని జరగటంలేదీ గుంటూర్లో !

అమ్మో ! ఇప్పుడెలా ?

ఆటో గుంటలోపడి ఒక్క జర్క్ ఇచ్చింది ముందుకు తూలబోయి ఆపుకుంటూ "ఆ బకెట్‌లో ఆవకాయ ఉంది. మూత ఎగిరిపోయిందేమో చూడు." అసంకల్పితంగా అన్నదామె

"సరిగ్గానే ఉంది." అంటూ తల కాస్త పక్కకు తిప్పి నవ్వాడతను.

"బాబోయ్! వీడు రౌడీ చచ్చినాడు. అలాగే ఉన్నాడు. లేకపోతే ఆ నవ్వేమిటి ? వీడేదో చేస్తాడు . ."

రక్తప్రసార వేగం అంతకంతకూ ఎక్కువవుతోందామెకు. 'ఆటో దారిమళ్ళిందా ? లక్ష్మీపురం ఇటేనా ? దరిద్రపు గోల, తనకు సరిగ్గా దారి తెలిచ్చావదు. స్టేషన్ మంచయితే తెలుసు. బస్టాండు నుంచి తెలీదు. వీడెటు తీసుకెడుతున్నాడో ! తను ... భర్తనూ, పిల్లల్నీ చూస్తుందా? లేకుంటే రేపొద్దున్న వార్తల్లో .'

ఒళ్ళంతా చెమటలు పట్టేస్తున్నాయి. గుండె గొంతులో కొచ్చేస్తోంది ఊపిరి బిగబట్టి చూస్తోంది శిల్ప .. .. .

రిక్షాలోనన్నా వచ్చింది కాదు. గబుక్కున దూకొచ్చు. ఆటోలో అదీ వీలవదు ..

నెర్వస్‌గా ముఖం తుడుచుకుంది. కళ్ళ దగ్గరా బుగ్గల దగ్గరా తడి

ఏడుస్తోంది తను ?!

ఆటో గుడ్డెద్దు చేల్లో పడ్డట్టు వెడుతూనే ఉంది .

భయం.. భయం. . భయం !

శంకర విలాస్ ముందుకొచ్చాక కాస్త ఊపిరందిందామెకు లూథరన్ కాలేజ్ ముందు కొచ్చేశాక ఎక్కడలేని ధైర్యం వచ్చింది

"ఆ పక్క సందు కాదు. రెండో సందుకు పోనియ్యి "

"ఆఁ ఆఁ ఇదే ఇల్లు ఆపు " ఉత్సాహంగా అన్నదామె.

"ఇదేమిటీ ! ఏ ఆపదా జరక్కుండా పజావుగా ఇంటి కొచ్చేసిందాతనొక్కతీ ? !"

ఊరగాయ బకెట్ దింపుతూ "తొణక లేదమ్మా " అంటూ నవ్వాడు ఆటోవాడు

ఇప్పుడీ డ్రైవర్ ముఖం రౌడీ ముఖం లాగానూ .. నవ్వు కుటిలంగానూ అనిపించటం లేదామెకు. అతని మొహంలో నమ్రత నవ్వులో ఆత్మీయతే కనిపిస్తున్నాయి

ఆరు రూపాయలు తీసుకుని "చిల్లర లేదమ్మా" అంటున్న డ్రైవర్‌తో "పోన్లే ఉంచేసుకో " అన్నది శిల్ప ఉదారంగా ★